వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 15 ఫిబ్రవరి 2024

## ఎన్నికల నియమావళి పాటించాలి

### ఎస్పీ కృష్ణారావు



**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నియమావళి పోలీసు ఆఫీసర్లు తప్పకుండా పాటించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిఐలు, ఎస్ఐలకు ఎన్నికల చట్టాలు ఎన్నికల నియమావళి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేయాలని, చట్ట వ్యతిరేకులను, సంఘవిద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి డాక్టర్ విబి రాజ్ కమల్, సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లె మండల తహసీల్దారుగా కుమార్ స్వామి బాధ్యతలు

**లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**



లక్కిరెడ్డిపల్లె తహసీల్దారుగా కుమారస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీలు విధితమే. ఇందులో భాగంగానే లక్కిరెడ్డిపల్లెలో పనిచేస్తున్న ఉదయ్‌శంకర్ రాజు అనంతపురం జిల్లా పెనుగొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా అప్పిరి మండలం తహసీల్దారుగా పని చేస్తున్న కుమారస్వామి లక్కిరెడ్డిపల్లె తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రెడ్డన్న, ఆర్ఐ సమ్మత్ ఖాన్, సర్వేయర్ కరీముల్లా, మరియు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మోసం చేసే తత్వం చంద్రబాబుది..

## మాట నిలబెట్టుకునే తత్వం జగనన్నది

### – సింహాద్రిపురంలో ఆసరా సమావేశంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



**పులివెందుల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

వైకాపా ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఆసరా మహిళల అభ్యున్నతి సాధించడం కోసం ఒక భరోసా అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలంలో పొదుపు సంఘాల మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నాల్గో విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ పూర్తిగా చేస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. కానీ జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పూర్తిగా నాలుగు దఫాలుగా మాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా రన్నారు. వైకాపా ప్రభుత్వంలోనే మహిళలకు మేలు జరుగుతోందన్నారు. చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకం అంటూ మళ్లీ మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ఎవరూ నమ్మవద్దన్నారు. మోసం చేసే వారికి కాకుండా మాట నిలబెట్టుకున్న వారికి పట్టం కట్టాలని ఆయన మహిళలను కోరారు. అనంతరం మహిళలకు మెగా చెక్కును అందించారు. బలపనూరు గ్రామానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5లక్షల నగదును ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి అందించారు. పులివెందులలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి పలు నూతన భవనాలను, వల్లభ మిల్క్‌డైరీని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూస రామమోహన్‌రెడ్డి, సింహాద్రిపురం మండల వైకాపా అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# రాయచోటి దశ దిశ మారుతోంది

### - అధునాతన హంగులతో జెడ్‌పి కార్యాలయ నిర్మాణం

### - జడ్‌పి కార్యాలయ భవన సముదాయ నిర్మాణ భూమిపూజలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్‌పి ఛైర్మన్ అమరనాథరెడ్డి

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



అన్నమయ్య జిల్లా అభివృద్ధిలో మరో ముందుదడుగు జిల్లా పరిషత్ కార్యా లయ భవన సముదాయ నిర్మాణానికి భూమి పూలో భాగంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జెడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పాల్గొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సుండుపల్లె రహదారి మార్గంలో టిడ్కో ఇళ్ల కస్తూరిబా పాఠశాల సమీపంలో జిల్లా పరిషత్ కార్యాలయ భవన సముదాయ నిర్మాణానికి జరిగిన భూమి పూజలో ముఖ్య అతిధులు ఎమ్మెల్యే, జెడ్‌పి ఛైర్మన్‌లు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్‌పి ఛైర్మన్‌లకు స్థానిక నాయకులు, అధికా రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన తరువాత రాయచోటిలో అన్ని విధాలా అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. జిల్లా ఏర్పడి 20నెలలు అవుతోందన్నారు. పలు శాశ్విత కార్యాలయాల భవన నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయని, మరికొన్ని పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. జెడ్‌పి కార్యాలయ భవన సముదాయ నిర్మాణాలను 11 ఎకరాలలో చేపడుతున్నామన్నారు. జెడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డితో మాట్లాడుతూ రూ. 1.20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, చిత్తూరు జెడ్‌పి నుంచి మరో కోటి రూపాయల నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. పెద్ద సభాభవనం, క్యాంపు ఆఫీసు, ప్రహరీ గోడ, తదితర నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఇటీవలనే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు రూ. 100 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. పట్టణం నాలుగు దిశలు అభివృద్ధి చెందుతోందన్నారు. ముందుచూపుతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు, అభివృద్ధి పనులకు వందలాది ఎకరాల భూములను కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ జెడ్‌పి కార్యాలయ భవన సముదాయ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో జిల్లా కేంద్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిసిఇఒ సుధాకర్‌రెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ తబ్రేజ్ ఖాన్, జెడ్‌పిటిసిలు వెంకటేశ్వరరెడ్డి, మాసన వెంకటరమణ,ఎస్‌కె ఖాదర్ మొద్దీన్, ఎంపిపి లక్కిరెడ్డిపల్లి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, వైస్ ఎంపిపిలు మిట్టపల్లె యధుభూషణరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకటరమణారెడ్డి, విఆర్ విద్యా సంస్థల అధినేత విఆర్ రెడ్డి, ఆసీఫ్ అలిఖాన్, జాకీర్, ఫయాజ్, అహమ్మద్, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జానం రవీంద్ర యాదవ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, గౌస్‌ఖాన్, పలువురు నాయకులు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యుడు సగినాల శివశంకర్, హరినాథరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

## రాయచోటి తహశీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితుడు



**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**

జిల్లా కలెక్టర్‌కు ఎన్ని అర్జీలు పెట్టినా రాయచోటి మండల తహశీల్దార్ కార్యాలయంలో న్యాయం జరగడం లేదని బుధవారం మనస్థాపం చెంది బాధితుడు అర్షద్ అహ్మద్ పెట్రోల్ పోసుకునిత ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి ప్రయత్నించాడు. తన తండ్రి సులేమాన్ రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగి మరణించాడని, నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నానని బాధితుడు అర్షద్ అహ్మద్ తెలిపాడు. బాధితుడు వివరాల మేరకు రాయచోటి మండల పరిధిలోని గున్నికుంట్ల రోడ్డు సర్వే నెంబర్ 800లో గత 30 సంవత్సరాల నుంచి తన తన తండ్రి సులుమాన్ పేరు మీద ఉన్న 75 సెంట్ల స్థలం ఉందని, గతంలో విచారణ చేసి అప్పటి తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి ఎండార్మెంట్ ఇచ్చారని, ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా అబుబకర్, ఖాదర్‌బాషా అనే వ్యక్తుల పేర్ల మీద రెవెన్యూ అధికారులు ఎక్కించారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇచ్చి 10రోజులు అవుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేధన వ్యక్తం చేశాడు. కలెక్టర్‌కు ఇచ్చిన స్పంద అర్జీని గున్నికుంట్ల ఆర్ఐ, విఆర్‌ఒకు ఇచ్చినా రేపు మాపు అంటూ పది రోజుల నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పి ఎలక్షన్ కోడ్ వచ్చే లోపు రాసి ఇస్తాం అని ఆర్ఐ, విఆర్‌ఒ చెప్తున్నారన్నారు. రిపోర్టు రాయకుండా తిప్పుకొంటున్నారని వాపోయాడు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితున్ని స్థానికులు, పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకొంటున్నాడు.

# మూతపడ్డ ఆదర్శ అంగన్వాడి కేంద్రం

### గర్భవతులు బాలింతలు పసిపిల్లలకు అందని పౌష్టికాహారం

### గృహాలకే పరిమితమైన పసి పిల్లలు




**సిద్ధవటం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని భాకరాపేట ఆదర్శ అంగన్వాడి కేంద్రం సుమారు సంవత్సరం కాలం నుండి మూతపడింది ఇక్కడ పనిచేస్తున్న అంగన్వాడి కార్యకర్త సహాయకురాలు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి వీటిని భర్తీ చేసే విషయంలో ఐసిడిఎస్ అధికారులు విఫలమయ్యారు అధికారుల తప్పిదం వల్ల భాకరాపేట అంగన్వాడి స్కూల్లో గర్భవతులు 15 మంది బాలింతలు 19 మంది 6 నెలల నుం డి 3 సంవత్సరముల వయసు ఉన్న పిల్లలు 68 మంది పౌష్టికాహారం అందడం లేదు. గర్భవతులకు బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా ఉండేం దుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఆశయాలను నీరుగారిస్తున్నారు సరైన సమయం లో సరైన పద్ధతిలో పౌష్టికాహారం అందించి భవిష్యత్తులో వీరందరికీ పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధకారులకు లేదా అనే విమర్శలు లేకపోలేదు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 11వ బెటాలియన్ అంగన్వాడి సెంటర్‌కువెళ్లలేక సరైన సమయంలో పౌష్టికాహారం అందబడడం లేదు రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు ఇక్కడ అధికారులు గండి కొడుతున్నారు 3 సంవత్స రముల నుండి 5 సంవత్సరములు వయసున్న పిల్లలకు అంగన్వాడి సెంటర్‌ను మూత వేయడంపై పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అంగన్వాడి సెంటర్‌కు రాని పిల్లలను గుర్తించి బడులకు చేర్పించాల్సిన అధికారులే ఇలా ఇంటి కి పరిమితమైన పసిపిల్లల భవిష్యత్తుతో చెలగాడటం ఆడడం ఎంతవరకు సమంజసం అంటున్నారు ఒకటి కాదు రెండు కాదు కొన్ని నెలలుగా అంగన్వాడి సెంటర్ మూతపడి ముళ్ల పొదలతో దర్శనమిస్తున్న అధికారులకు చలనం లేక పోవడంపై గ్రామ ప్రజలు మండిపడుతున్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మూతపడ్డ అంగన్వాడి కేంద్రాన్ని తెరిపించాలని పలువురు కోరుకుంటున్నారు.

# అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్




**కడప క్రైం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 13వ తేదీన రవీంద్రారెడ్డి అనే అతని పేరు మీద విశాఖపట్నం సామ్రాట్ ఎంక్లేవ్, నౌరోజీరోడ్డు, మహారాణిపేటకు చెందిన పినపాల ఉదయ భూషణ్ ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్‌కు ఆయన పిక్ పెట్టి వైఎస్ షర్మిలా రెడ్డి మరియు వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డిలపైన అసభ్యకర పదజాలంతో వారిని అవమానించే విధంగా పోస్టులు పెట్టడం జరిగింది. ఈ విషయం గురించి వర్రా రవీంద్రారెడ్డి తన పేరు, తన ఫొటోలు ఉపయోగించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని పోలీసులకు పులివెందుల పీఎస్ లో ఈనెల 3వ తేదీన కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులోని ఫిర్యాది అయిన రవీంద్రారెడ్డి వైఎస్ఆర్ సోషల్ మీడియా మెంబరుగా ఉంటూ పార్టీకి సంబంధించిన మెసేజ్‌లు పోస్టు చేస్తుంటాడు. కొన్ని సందర్భాలలో చంద్రబాబు మరియు లోకేష్‌లను విమర్శిస్తూ పెట్టిన మెసేజ్ వలన పల్లె రవీంద్రారెడ్డిని వాళ్ల పార్టీ వారితోనే తిట్టించి కొట్టించాలని అతని పేరుతో ఫేస్ బుక్ ఫేక్ ఖాతా తెరిచి ఇలా చేసి పోస్టులు పెట్టడం జరిగింది. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని తన పర్యవేక్షణలో పులివవెందుల ఎస్‌డీపీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పులి వెందుల ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడులు ఫేక్ ఖాతా వివరాలు పరిశీలించి డేటా బేస్ ఆధారంగా ముద్దాయి చిరునామా వివరాలను పరిశీలించి విశాఖకు చెందిన ఉదయ భూషణ్ ను గురించి అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన చేధించిన పులివెందుల అర్బన్ ఇన్‌స్పెక్టర్, సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# జిల్లా కేంద్రం ఆశలు ఆవిరి

### – పల్లెబాటలో చిరు వ్యాపారులు

**రాయచోటి, ఫిబ్రవరి 13, ప్రభాత వార్త :**



అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కావడంతో ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. జిల్లా ప్రటకన అనంతరం రాయచోటి పట్టణం చుట్టు పక్కల భూములకు రెక్కలు వచ్చాయి. పలు రకాల ప్రభుత్వ ఆఫీసులు, ఉద్యోగులు రావడం జరిగింది. అయితే జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఇంటటి పన్ను, ఆస్తి పన్నులు పెరుగుదలతో ఇంటి యజమానులు భారీగా ఇంటి బాడుగలు పెంచారు. దీంతో ఉద్యోగులు చాలా వరకు కడప, చిత్తూరు, తిరుపతి, రాజంపేట, మదనపల్లె, పీలేరు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. తొలుత ఇంటి యజమానులు కూడా భారీగా బాడుగలు పెంచారు. ప్రస్తుతం చాలా మంది ఇళ్లను ఖాళీ చేసి సొంత ఊర్లకు వెళ్తున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు భూముల ధరలను భారీగా పెంచి రియల్ ఎస్టేట్ రంగం కుదేలయింది. దాదాపు ముందున్న రేట్ల కంటే మూడు రెట్లు పెంచి వ్యాపారాలు చేశారు. ప్రస్తుతం స్థలాలు కానీ, ఇండ్లను కూడా కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. చాలా మంది ఇళ్లను నిర్మించి అమ్మడానికి సిద్ధంగా ఉంచారు. కొనుగోలుదారులు లేక ఆందోళన చెందుతున్నారు. చాలా మంది వ్యాపారులు తమ వద్దనున్న డబ్బులకంటే అధికంగా కొనుగోలు చేశారు. దీంతో ప్రస్తుతం చాలా మందది ఇక్కట్లకు గురవుతున్నారు. కొనుగోలుదారులు చాలా మంది తమ స్థలాలను ఇళ్లను ఆయకం పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు. జగనన్న కాలనీ ఇండ్ల నిర్మాణం పూర్తయితే దాదాపు 8వేల ఇల్లు పట్టణం నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉంది. జిల్లా కేంద్రం అయిన తర్వాత పల్లెల నుంచి పట్టణానికి వచ్చి ఏద ఒక వ్యాపారం పెట్టడం అవి సక్రమంగా జరగకపోవడంతో ఖాళీ చేయడం జరుగుతుంది. రాయచోటిలో నిరుద్యోగులకు ఎలాంటి కంపెనీలు లేకపోవడం, వీరు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తరలిపోవడం జరుగుతున్నది. జిల్లా కేంద్రం అయినప్పుడు ప్రజలు ఎంతో ఆశతో అభివృద్ధి జరుగుతుంది, వ్యాపారాలు జరుగుతాయి బ్రతకడానికి అనుకూలంగా ఉంటుందని చుట్టు పక్కల పల్లెల నుంచి కూడా రాయచోటికి రావడం జరిగింది. ప్రస్తుతం రాయచోటి పట్టణం ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి.

## నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెదేపాలోకి వలసలు...!

### సాదరంగా ఆహ్వానిస్తున్న తెదేపా జాతీయనేత నల్లారి

**పీలేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**



కలికిరిలో రోజురోజుకు పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెదేపాలోకి భారీగా వలసలు ప్రారంభమైయ్యాయి. కలికిరి మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురంలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో తెదేపా జాతీయనేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి తెదేపాలోకి వచ్చిన నాయకులు కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఒక్క ఛాన్సు అంటూ అన్ని రంగాల ప్రజలకు మోసం చేయడమే పనిపెట్టుకున్నారన్నారు. పాద యాత్రలో ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కి వ్యవస్థలను అదోగతి పాలు చేసి అధికారులకు పావులుగా వాడుకుని వాళ్ల జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. పార్టీని నమ్ముకుని వచ్చిన వారందరి సమస్యలు పరిష్కరించడంతో పాటు సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో తెదేపా వచ్చే ఎన్నికల్లో ప్రభంజనం సష్టించి నవశకానికి నాంది పలకనుందన్నారు. కార్యక్రమంలో స్వరూప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రామమోహన్ రెడ్డి తేజేశ్వరరెడ్డి, ద్వారకనాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, నాగేంద్ర, రమేష్, మనోహర్, నాగయ్య, వేణుగోపాల్ పవన్ నాగార్జున, రెడ్డెప్ప వినోద్, కష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి నరసింహులు సతీష్ తెదేపా తీర్థం పుచ్చుకున్నారు.

## మంగంపేట భూముల పరిహారం పంపిణీలో గోల్‌మాల్

– సాకులు చెబుతూ మాయాజాలం ఓ కంపెనీ యాజమాన్యం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో ఉన్న కొన్ని సర్వే నంబర్లకు సంబంధించి ఏపీఎండీసీ సంస్థ ఓ ప్రైవేటు కంపెనీకి సెటిల్‌మెంట్ వ్యవహారం అప్పచెప్పింది. అయితే అర్హులకు సున్నా, అనర్హులకు అందలం అనే సామెతకు నిదర్శనంగా నిలిచింది. ప్రశ్నించే వారికి బెదిరింపులు, కోర్టుల ద్వారా నోటీసులు ఇచ్చే వారికి పరిహారం పంపిణీలు లేకుండా అందులో ఎక్కించి పరిహారం అప్పజెప్పారు. అన్ని రికార్డులు ఉండీ అధికారులు చెప్పినా మీరు ఆలస్యంగా వచ్చారు. మేమేమీ చేయలేమని చేతులెత్తే స్తున్నారు. అన్ని భూ రికార్డులు ఉండి గతంలో కొంత మంది రెవెన్యూ అధికా రులు చేసిన తప్పుల తడకలు దృష్టిలో ఉంచుకొని అనర్హులకు అందలం, అర్హులకు మొండిచెయ్యి అందిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. భూములకు సంబంధించిన భూరికార్డులు ఉన్నప్పటికీ సర్వే నంబరు 8లో కొందరు లోపాయి కారి ఒప్పందాలు కుదుర్చుకొని కంపెనీ ద్వారా పరిహారం పంపిణీ సాగి స్తూ ఉండేది. అయితే గతంలో అన్ని భూ రికార్డులు ఉన్న కొందరికి మాత్రం అడంగల్‌లో లేవని సాక్షిపుతూ పరిహారం పంపిణీలో జాప్యం చేస్తూ నిర్లక్ష్య సమాధానాలు ఇస్తూ భూ సర్వే పరిహారం పంపిణీ చేసి అధికారులు సాకులు చెబుతూ మేమేమీ చేయలేమంటూ చేతు లెత్తేస్తూ ఉన్న వారికి లేనట్లు లేని వారికి మాత్రం బడా బాబులకు రాజకీయ పరపతి ఉన్న వారికి మాత్రం పరిహారం ఇస్తూ నిరుపేద లైన వారికి భూ హక్కుదారులకు పరిహారం పంపిణీలో పొంతన లేని సమాధా నాలు చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది రైతులకు సంబంధిం చిన చెట్లకు, భూములకు కూడా పరిహారం పంపిణీలో జాప్యం జరుగు తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా త్రివేణి కంపెనీ యాజమాన్యం పునరాలోచించి పాత రికార్డులు పరిశీలించి అర్హులైన వారికి పరిహారం అందించాలని లేనిపక్షంలో ధర్నాలు చేసి న్యాయమైన చర్యలకు సిద్ధమవుతామని ఆ కంపెనీ యాజమాన్యాన్ని కోరుతున్నారు.

## అవకాశం ఇస్తే అభివృద్ధి చూపిస్తా : పుట్టా

చాపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రానున్న ఎన్నికలలో తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చూపిస్తానని మైదుకూరు తెలుగుదేశం పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. బుధవారం బాబు ష్యూరిటి భవిశ్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమంలో భాగంగా వెదురూరు గ్రామంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా శ్రీపార్వతి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానం నందు పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీలోకి చేరికలు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రజా సేవ చేసేందుకే రాజకీయాలలోకి వచ్చానని, స్వార్థం కోసం కాదని రానున్న ఎన్నికలలో తనను గెలిపించాలని కోరా రు. తనను నమ్మిన కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాల ఆదుకుం టానని భరోసా ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కానెపల్లె సదాశివారెడ్డి, పాలగిరి ఓబుల్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, జనసేన ఇంచార్జ్ పందిటి మల్హోత్ర, మిల్లుశ్రీను, మేకల బాబు, నారపు రెడ్డి మధుసూధన్‌రెడ్డితో పాటు పలువరుకు టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

## చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే భూమిపూజ

చాపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



మండల కేంద్రమైన చాపాడు లోని ఎస్సీ కాలనీలో నూతన చర్చి నిర్మాణానికి బుధవారం మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియో జికవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో చర్చి శిధిలావస్థకు చేరడంతో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నుండి 12 లక్షల రూపాయలు మంజూరు చేయించామని, నిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టాలని శాసనసభ్యులు కోరారు. ఆయన వెంట మండల అధ్యక్షులు లక్ష్మయ్య, మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధం

### టిడిపి ఇంచార్జీ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



ప్రొద్దుటూరులో వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న అంశంపై ఎమ్మెల్యే రాచమల్లుతో చర్చిచేందుకు తాను సిద్ధమని టీడీపీ ఇంచార్జీ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక 26వ వార్డులో టిడిపి నాయకులు సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబుష్యూరిటి భవిశ్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సంబంధించిన కరపత్రాలు పంపిణి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరులో అభివృద్ధి చేసి ఉంటేనే ప్రజా సంక్షేమం అందించి ఉంటేనే ఓటెయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో ఎక్కడ అభివృద్ధి చేశారో స్పష్టం చేయాలని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో ప్రొద్దుటూరు నియోజికవర్గంలో ఎంత మేరకు అభివృద్ధి జరిగిందనేది నేటి నుండి పరిశీలిస్తామని తెలిపారు. మొదలగా జగనన్నా కాలనీలో ఎమ్మెల్యే రాచమల్లు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు నిర్మించి ఎంతమంది లబ్ధిదారులకు అందించారో నీకు తెల్చుతామన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయకపోయిన అభివృద్ధి చేశానంటూ ప్రజల ముందుకు వెల్లడం విడ్డూరంగా ఉందన్నారు. దోమలు లేని ప్రొద్దుటూరును చేస్తానన్న ఎమ్మెల్యే రాచమల్లు హామీ ఏమైందని ప్రశ్నించారు. నాడు జగన్ ప్రజాసంకల్ప యాత్రలో దోమలు ప్రొద్దుటూరును చేస్తానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారని విమ ర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీ.వీరశివారెడ్డి, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, జయసుమారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎన్నికల పరిశీలకుడు ఏవిఆర్ ప్రసాద్‌రెడ్డి, బండివిజయభాస్కర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, ధనిరెడ్డి విశ్వనాధరెడ్డి పాల్గొన్నారు.

## ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన పలువురు

రాజుపాళెం, ఫిబ్రవరి14, ప్రభాతవార్త



మండల పరిదిలోని పర్లపాడు గ్రామంలో బుదవారం స్థానిక నాయకులు నల్లదిమ్ము చౌరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి ఇంచార్జ్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి సమక్షంలో వార్డు మెంబరు పెద్దరాముడు, రమాదేవి భర్త వీరభాస్కర్‌తో పాటు పలువురు టిడిపి కండువాలు కప్పుకొని పార్టికోసం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అద్వర్యంలో పని చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది టిడిపి బలం పుంజుకుంటున్నదని తెలుపుతూ రాచమల్లు అరాచకం, రౌడిజం ఓర్చుకోలేని ప్రజలు గట్టిగా బుద్ది చెప్పటానికి సిద్దంగా ఉన్నారని టిడిపి గెలుపు కాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టంగుటూరు విశ్వనాధరెడ్డి, సానా వెంకట సుబ్బారెడ్డి, నల్లదిమ్ము చౌరెడ్డి, పొన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు మేలు జరిగి ఉంటే తిరిగి ఆశీర్వదించండి

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరిగిన మాట వాస్తవం అయితే రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆశీర్వదించేందుకు నేటి నుండి నిర్వహించే ఎన్నికల ప్రచారంలో తనతో పాటు కలిసి రావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజికవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను మూడవసారి పోటీ చేస్తున్నానని తెలిపారు. అందులో భాగంగా నేటి నుంచి నిర్వహించే ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటగా అమ్మవారి శాలలో పూజలు నిర్వహించి అనంతరం రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అక్కడి నుండి ఒకటవ పట్టణ కూడలి వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామన్నారు. ప్రొద్దుటూరు నియోజికవర్గంలో ఎమ్మెల్యేగా తన వల్ల మేలు జరిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రచారంలో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటి వల్ల ప్రజలకు మేలు జరిగిందని భావిస్తే, ప్రొద్దుటూరు నియోజికవర్గంలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందని భావిస్తే తన మానవత హృదయంతో కష్టాలలో వారికి ఆర్థిక సహాయం చేస్తున్న మాట వాస్తవం అయితే తిరిగి ఎమ్మెల్యేగా మూడవసారి తనను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను నియోజికవర్గ అభివృద్ధి చూపి ఓటు అడుగుతుంటే ప్రతిపక్ష టీడీపీ చేయని అవినీతిపై విశ్వప్రచారంతో ఓటు అడిగే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. వాటిలో ఏది నిజమైతే దానికి ప్రాధాన్యతనిచ్చి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైస్‌చైర్మెన్‌లు పాతకోట బంగారు రెడ్డి, సీఎస్‌ఖాజామొహీద్దీన్, రాయలసీమ పోలీస్‌కంప్లైంట్ అధారిటి సభ్యులు కాకర్ల నాగేశారెడ్డి పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించిన ఉద్యోగులు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు కేజే రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించి మధ్యా హ్నం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి 16న్యాయ మైన హక్కులతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా కేజే రఘు రామిరెడ్డి మాట్లాడుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో, కడప జేఏసీ ఆదే శానుసారం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చమని ప్రభుత్వా నికి వినతి పత్రం ద్వారా తెలుపుతున్నామని, ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఉద్యోగికి, ప్రతి కార్మికునికి, ప్రతి విశ్రాంత ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు. జేఏసీ కన్వీనర్ రామసుబ్బయ్య, ఎస్టీయూ యూనియన్ నుండి రషీద్‌ఖాన్, ఏపీటీఎఫ్ నుండి కృష్ణారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నుంచి చెన్నారెడ్డి, వెంకటయ్య, క్లాస్ ఫోర్ అసోసియేషన్ నుండి సుబ్బయ్య, పాపిరెడ్డి, ఉమెన్స్ విత్ అసోసియేషన్ నుంచి వైస్‌ప్రెసిడెంట్ జయంతికుమారి, సంధ్య, మధు, శివ రామానుజం, ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ నాగార్జున, పెద్ద సంఖ్యలో వివిధ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## ఘనంగా సద్గురు ఆదిశంకరాచార్య ప్రతిష్ట మహోత్సవం

రైల్వేకోడూరురూరల్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పట్టణంలోని కొత్త కోడూరులో బుధవారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సద్గురు ఆదిశంకరాచార్య ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి ధ్వజా రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, బ్రాహ్మణ సంఘం నాయకులు ఆర్.సి. సురేష్, ఒరుగంటి నవీన్ పాల్గొని హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల మాట్లాడుతూ ఎంతో కాలంగా కొత్త కోడూరులో ఆది శంకరాచార్యుల విగ్రహ దేవాలయాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దే శ్యంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ఓబులవారిపల్లి, చిట్వేలి, కోడూరు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణులు వందల సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## రాజు హైస్కూల్లో వసంత పంచమి వేడుకలు

### వైబిఎన్‌పల్లెలో సర్వస్వతి దేవికి పూజలు



రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

పవిత్ర వసంత పంచ మి ని పురస్కరించుకుని రాజంపేట రాజు హైస్కూల్లో ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించారు. వేద మంత్రో చ్చారణ మధ్య ఈ పూజ లు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులకు పాద పూజ చేశారు. తల్లీ గురువులకు హారతినిచ్చి ప్రత్యేకంగా ఆశీర్వాదాలు తీసుకున్నారు. వైబిఎన్ పల్లెలో బిజెపి నేత రమేష్‌నాయుడు స్థానిక పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు సిఇఓ రఘు రామరాజు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి శేసారెడ్డి, హబీబ్, సుబ్బారెడ్డి, మహిళా ఉపాధ్యాయులు రతి, చోళి, భారతి, స్పందన, చంద్రకళ పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, ఎన్‌జిఓ, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయి ఉన్న నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజంపేట తాలూకా జెఎసి ఛైర్మన్‌ఎస్.వి. రమణ, చంద్రశఖర్‌రెడ్డి, రవికుమార్, రమణయ్య, ఆదినారాయణ, సుమలత, లక్షుమ్మ, హైమావతి పాల్గొన్నారు.

## మరోసారి రెండు సెట్లు దాఖలు చేసిన రఘునాథరెడ్డి

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



బుధవారం మంచి రోజు కావడంతో మేడా రఘునాథరెడ్డి రెండు సెట్ల నామి నేషన్లను ఎన్నికల అధికారికి అందజేశారు. రెండు రోజుల కిందట సిఎం ఆదేశాల మేరకు వైఎస్ అభ్యర్థులు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసిన విషయం విదితమే. రఘునాథరెడ్డి నందలూరు మండలాధ్యక్షులు మేడా విజయ భాస్కర్ రెడ్డి, సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డి, రాజంపేట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మణ . యోగీశ్వర్‌రెడ్డితో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు.

## గొల్లపల్లెలో బాబుకు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



మైలవరం మండలం వద్దిరాల పంచాయతీలోని గొల్లపల్లె గ్రామంలో బుధవారం బాబూ స్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతమ్మ నియోజకవర్గం అభివృద్ధికి భూపేష్‌రెడ్డిని గెలిపిం చాలని ప్రజలను కోరారు. వచ్చే ఎన్నికల్లో తెదేపానఉ గెలిపించి చంద్రబాబు నాయుడును సీఎం చేయాలని, భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. అనంతరం చంద్రబాబునాయుడు మేనిఫెస్టోను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు, దేవగుడి కుటుంబ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లక్కిరెడ్డి పల్లె తాలూకా ఏపీఎన్జీవో అధ్యక్షుడు బలరామరాజు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె తహసీల్దా రు కార్యాలయం ఎదుట మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెన్షనర్ల, ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులేషన్ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవదానం, పెన్సనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు వెంకటరమణ, ఎన్జీవో నాయకులు సాహెబ్ రహీం, వెంక టేష్, డీటీ రెడ్డయ్య, వీఆర్వోలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిని గొప్ప మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, తెదేపా నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్వర్గీయ మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాన్ని బి.ఎర్రగుడి పంచాయతీలోని బీప నాగిరెడ్డిపల్లెలో టోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, టీడీపీ మహిళా మణులు తదితరులు పాల్గొన్నారు.

## 16న రాయలసీమ స్థాయి సమావేశం

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రాయలసీమ జిల్లాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురంలో ఏపి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ ప్రత్యేక సమావేశం ఉంటుందని కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు విలేకరుల సమావేశంలో తెలిపారు. పైన తెలిసిన కడప జిల్లాకు సంబంధించిన వారందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షులు విష్ణుప్రీతం రెడ్డి, పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ధ్రువకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ బైజూస్ విజయ దుందుబి

### కడపలో 10 మంది విద్యార్థులకు 91 పర్సంటైల్

– ఆకాష్ బైజూస్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త




జేఈఈ మెయిన్స్ 2024 మొదటి సెషన్‌లో 300 మార్కులతో వంద పర్సంటైల్‌ను ఆకాష్ బైజూస్ విద్యార్థి రిషిశేఖర్ శుక్లా సాధించి అగ్రస్థానంలో నిలిచారని ఆకాష్ బైజూస్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని ఎర్రముక్కపల్లెలో ఉన్న ఆకాష్ బైజూస్ విద్యా సంస్థలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నుంచి 10 మంది విద్యార్థులు 91కి పైగా పర్సంటైల్ సాధించారని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన రిషి శేఖర్ శుక్లా అనే సిద్దగురు విద్యార్థి అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు ఆకాష్ బైజూస్ గర్విస్తోందన్నారు. ఈ విద్యార్థి తెలుగు రాష్ట్రంలో అత్యధిక స్కోరర్‌గా నిలవడమే కాకుండా దేశంలోని పోటీ పరీక్షలలో తన నిబద్ధత చాటటారని చెప్పారు. ఆకాష్ బైజూస్ రీజనల్ సేల్స్ అండ్ గ్రోత్ హెడ్ ఎం.భరత్‌కుమార్ మాట్లాడుతూ కడపలోని ఆకాస్‌కు చెందిన విద్యార్థులు కూడా 99.97 పర్సంటైల్ సాధించారని విద్యార్థులను అభినందించారు. సమావేశంలో ఆకాష్ బైజూస్ బ్రాంచి హెడ్ మిరావలి, బ్రాంచ్ ఇంజినీరింగ్ అకాడమిక్ హెడ్ మహ్మద్ అప్సర్ బాషా, సాయి రాం విద్యా సంస్థల ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యా ర్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున విద్యార్థులు సంబరాలు చేసుకుకొని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

## సమ్మెకు మద్దతివ్వం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

ఏపీఎండీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పునరావాస గ్రామాల ఉద్యోగులు ఈనెల 16వ తేదీ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు ఇవ్వమని తేల్చి చెప్పేశారు. ఇంత వరకు న్యాయమై ఉద్యోగాలు ఇవ్వడం లేదని మేము 15 సంవత్సరాలుగా మా పునరావాస గ్రామాలు ఉద్యోగులను రెగ్యులర్ చేయమని పోరాడుతున్నామని పునరావాస గ్రామాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. గతంలో కూడా అనేకమార్లు లాస్ ఆఫ్ పేలు వేసుకొని మరీ ఉద్యమాలలో పాల్గొనడం జరిగిందని మాకు ఎటువంటి న్యాయం జరగడం లేదని వారు తెలిపారు. కార్యక్రమంలో పునరావాస గ్రామస్థులు, ఉద్యోగులు సకినాల సుబ్రమణ్యం, శ్రీనివాసులు, నాగరాజు, బాలాజీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సర్పంచుల నిరసన

విఎన్‌పల్లి ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని వీరపనాయన పల్లెలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మండలంలో కరువు ఛాయలు నందున కరువు మండలముగా తీర్మానం చేశారు ఈ సమావేశం నందు తలపనూరు గ్రామ సర్పంచ్ మారుతి రెడ్డి అధికారుల తీరును నిరసిస్తూ తన నిరసనను తెలియజేశారు అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని ఆయన తెలిపారు గత కొంతకాలంగా తమ గ్రామములో ఉపాధి హామీ పనులను అధికారులు పెట్టడం లేదని తెలిపారు సర్పంచ్ హెూదాలో ఎన్నోమార్లు అధికారులను దృష్టికి తీసుకు వెళ్లిన వారు పట్టించుకోవడంతో తప్పనిసరి పరిస్థితులలో ఈ విధంగా చేయవలసి వచ్చినదని తెలిపారు పలువురు సర్పంచులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు కృషి చేస్తామని తెలిపారు ఎంపీడీవో ఎమ్మార్వో పంచులు అధికారులు పాల్గొన్నారు

## కెఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు




కడప ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

సమాజ సేవలో భాగంగా కె ఎస్ ఆర్.ఎం కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభా గం వారి ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఏడు రోజుల ప్రత్యేక క్యాంపులో ఈరోజు నాలుగవ రోజు న కొప్పర్తి గ్రామంలో కళాశాల విద్యా ర్థులు ఆరోగ్య స్థితిగతులు, పరిసరా ల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమానికి స్టేప్ ఆఫీస్ అధికారి పి.సుబ్బరాయుడు ప్రత్యేక ఆహ్వాని తులుగా హాజరై విద్యార్థులు చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవలో ముం దు ఉండడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, విద్యార్థులను అభినందిస్తూ ముమ్ముందు మరిన్ని సామాజిక కార్యక్రమాల నిర్వహించాలని విద్యార్థులను ఆకాంక్షించారు.

2019 ఫిబ్రవరి 14న పుల్వామా ప్రాంతంలో దేశం కోసం పోరాడుతూ అసువులు బాసి వీరమరణం పొందిన అమర జవానులకు కె.ఎస్.ఆర్.ఎం కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఇది చాలా దురదృష్టకరమైన, హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఈ సందర్భంగా కళాశాల వందల మంది విద్యార్థులు, కొప్పర్తి నుండి కే.ఎస్. ఆర్.ఎం కళాశాల వరకు ర్యాలీలో పాల్గొని జై జవాన్, అమర వీరుల అమర్ రహే అనే నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో కళాశాల ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె. సురేష్‌బాబు సమన్వయకర్తగా వ్యవహరించారు.

## సమ్మెకాలం వేతనం చెల్లించేందుకు జీఓ జారీ చేయాలి

### మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



గత నెలలో సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకాలం నాటి వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే జిఓ జారీ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. సిఐటియు నాయకులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ సమ్మెకాలానికి సంబంధించిన వేతనాన్ని చెల్లించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే జిఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరోసారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయ కులు యోబయ్య, రమణ, సాలమ్మ, సురేష్,ప్రమీల,మధు,పెంచలయ్య, పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రైతులకు కార్మికులకు ఉద్యోగులకు జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్య క్రమాలు చట్టాలపై పోరాడేందుకు ఈనెల 16వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెకు ఏపీఎండీసీ జేఏసీ నాయకులు, కార్మికులు మద్దతు తెలుపుతున్నట్లు సీపీఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చి అనుమతి తీసుకున్నట్లు నాయకులు రేకుల గుంట వెంకటేష్, భాస్కర్‌లు తెలిపారు. కార్మికులకు జరుగుతున్న అన్యా యాలను అరికట్టి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారానికి ఒక రోజు మద్దతు తెలిపి జేఏసీ సమ్మెలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులు సహకరించాలని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని జమ్మల మడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం గడ్డ వీధి వద్ద అశేష జనవాహిని మధ్య నఉంచి గడప గడపకు మన ప్రభఉత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించి మరింత అభివృద్ధి, సంక్షేమం జరిగేలా చూడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు జరిపారని సీఎం జగన్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వరరెడ్డిఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు పాలూరు నరసింహులు, కౌన్సిలర్ బేపారి నూరిన్నిసా, డా.అగస్టిన్‌రాజు, వైస్ ఛైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ పొచ్చిరెడ్డి రమణారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



జమ్మలమడుగు మండలంలోని అంబవరం గూడెం చెరువు, కొండ తోట గ్రామాల్లో ప్రభుత్వ పోరంబోకు బూములలో అధికార పార్టీ వైసీపీ సేన కొంత మంది బడా నాయకులు భూ దందాలు చేస్తుంటే వారికి కొమ్ముకాస్తున్న తహసీల్దారు పై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్డీవోకు బీజేపీ నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బబీజేపీ నాయకులు పుష్పరాజు, కారపాకుల రాజశేఖర్, 8వ వార్డు మెంబర్ మంచాల సునీత, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలి

**రోడ్లపై ఆటోలు, ద్విచక్రవాహనాలు, తోపుడు బండ్లు పెడితే చర్యలు**

**వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ**

**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**



రోజురోజుకు పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా వాహనాలు ఎక్కువ కావడంతో ట్రాఫిక్ అంతరాయానికి గురికాకుండా ప్రతి వాహనదారుడు సహకరించాలని అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం సాయంత్రం సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణలు పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలో పలు ప్రధాన రహదారులు తిరుగుతూ ట్రాఫిక్‌పై ప్రజలకు, వ్యాపారులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారులు తోపుడు బండ్లు వ్యాపారులు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ అంతరాయానికి గురైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టుధరించాలని వాహనాలు తోలేటపుడు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వాహనాలను నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డును సరిచేసుకుంటూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌తో పాటు పలు రికార్డులను సరిచూసుకోవాలన్నారు. వీరివెంట పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ఇంటిపట్టాలు పంపిణీ

**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులో వార్డు కౌన్సిలర్ గానుగపెంట సమత, వార్డు ఇన్‌చార్జి రమేష్‌బాబు ఆధ్వర్యంలో వార్డులోని పలువురికి ఇంటిపట్టాలను ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు సుందర రామిరెడ్డి, వైసీయూ ఈసీ మెంబర్ కొండపల్లి చిన్న సుబ్బారావు, కన్వీనర్ యద్దారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటిపట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పట్టాలను అందజేయడం జరిగిందన్నారు. జగన్ పాలన అంతా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతోందని ఈ విషయం ఇప్పటికే ప్రజలకు అవగాహన కలిగి ఉంటారన్నారు. గతంలో ఏ చిన్న సర్టిఫికెట్ అవసరం వచ్చినా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వారికి నేరుగా ఇంటి వద్దనే సంబంధి, కుల, ఆదాయ, తదితర సర్టిఫికెట్లను అందజేస్తూ ముఖ్యమంత్రి అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. 7వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు కూడా వార్డు కౌన్సిలర్ చేపట్టడం జరిగిందని, వార్డులో ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారికి అందుబాటులో ఉంటూ రమేష్‌బాబు ఉండడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ, చెన్న క్రిష్టారెడ్డి, మౌలాలి, క్రిష్ణ, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది వార్డు నాయకులు పలువురు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ బుక్ గివింగ్ డే

**కమలాపురం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

ఇంటర్నేషనల్ బుక్ గివింగ్ డే సందర్భంగా సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ పీజీ కళాశాలలో గ్రంథాలయ బాధ్యులు విజయభారతి, హేమసుందరిలు కార్యక్రమం నిర్వహించారు. అందులో ముందుగా వ్యాసర చన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు వైస్ ప్రిన్సిపల్ డా.పల్లా కృష్ణ బహుమతులు అందేయడం రిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సీవీ రాజగోపాల్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యత, విలువల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా ఈ రోజు విశేషం పేద విద్యార్థులకు పుస్తకాలను అందజేయడం అని ఈ సందర్భంగా కమలాపురం ఎయిమ్ ఫర్ సేవా నందు ఉన్న విద్యార్థులకు 45 పుస్తకాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్..!

**జయహో బీసీ కార్యక్రమంలో తెదేపా జాతీయనేత నల్లారి**

**పీలేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**



కలికిరి స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీలకు ప్రాతినిథ్యం వహించడానికి రాజ్యాధికారం కోసం అగ్ర తాంబూలం అందించింది. తెదేపా వ్యవస్థాపకులు అన్న నందమూరి తారకరామారావుగారేనన్నారు. బీసీలకు సామాజిక పరంగా, ఆర్థికపరంగా ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది చంద్రబాబేనని తెదేపా జాతీయనేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు కలికిరి పట్టణంలోని హేమాచారి కళ్యాణమండపంలో జయహో బీసీ కార్యక్రమం రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు వాసునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో బీసీలపై దాడులు, వేధింపులతో అధికారం లేక అణగదొక్కబడుతున్నారని కనీసం కార్యాలయంలో కూర్చోవడానికి కుర్చీలు లేని దుస్థితి ఏర్పడిందన్నారు. 34 శాతం రిజర్వేషన్లకు కుదించి 24 శాతం చేసి ప్రాతినిధ్యం వహించే అవకాశం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. తెదేపా అదికారంలోకి రాగానే బీసీలకు రక్షణ సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆ ఉద్దేశ్యంతోనే చంద్రబాబు మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురేంద్రయాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు వసంతలరాజా, మండల అధ్యక్షులు నిజాముద్దీన్, జనార్ధన గౌడ్, ఉపాధ్యక్షులు వైజాగ్‌బాషా, వేంపల్లె అబ్దుల్ ఖాదర్, రామమూర్తి, రవి, సహదేవరెడ్డి, మాలతి, సైపుల్లా, రహంతుల్లా, వేణుగోపాల్ తెదేపా నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

# అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా



**దువ్వూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మైదుకూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని మైదుకూరు తెదేపా ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన దువ్వూరులో తెదేపా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రతి గ్రామాన తెదేపాను బలోపేతం చేయాలని కార్యకర్తలను కోరారు. అలాగే ప్రజలకు తెదేపా మేనిఫెస్టోలోని పథకాలు వివరించి తెదేపాకు మద్దతు పలకాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఎమ్మెల్యేగా ఎన్నికైతే దువ్వూరులోని బస్టాండు, డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని రాజోలి రిజర్వాయరు నిర్మానం చేపడతామన్నారు.కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, రాంబాబు, సంజీవరెడ్డి, తాహర్ హుసేన్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్ ఖాసీంఖాన్, రాష్ట్ర ఆడిటర్ల సంఘం అధ్యక్షులు షరీఫ్‌ఖాన్

**కడప ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

కడప నగరం నబికోటకు చెందిన పేద విద్యార్థి వి.రాజేష్ రెడ్డి చార్టర్డ్ అకౌంటెంట్ కోర్స్ చదువుకుంటున్నందున అతని పేదరికము చూసి మూడు సంవత్సరముల పాటు సంవత్సరమునకు రూ. 20వేలు రూపాయలు చొప్పున సహాయము చేయుటకు అంగీకరించి రెండవ విడతగా పదివేలు రుపాయలు తమ తల్లి పేరిట నెలకొల్పిన చాంద్ బి మెమోరియల్ ట్రస్ట్ తరుపున విద్యార్థి తల్లి వి.లక్ష్మీదేవి ఆమె కుమారుడు వి.రాజేష్ రెడ్డికి రూ. 10వేలు ఆర్థిక సహాయము అందజేశారు. ఇంకా రెండు సంవత్సరములు రూ. 40వేలు ఆర్థిక సహాయము అందిస్తామని లయన్ పి.ఖాసీం ఖాన్ వాగ్దానము చేశారు. కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిటర్ల సంఘం అధ్యక్షుడు షరీఫ్ ఖాన్ పాల్గొన్నారు.

# గోల్డ్‌మెడల్ సాధించిన వైష్ణవి

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**



మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన సోమ వైష్ణవి 2022-23 సంవత్సరంలో అగ్రికల్చర్ ఎమ్మెస్సీ ఎకనామిక్స్ విభాగంలో డాక్టర్ పంజాబ్ రావ్ దేశ్‌ముఖ్ కృషి విద్యాపీఠం అగ్రికల్చర్ యూనివర్శిటీలో నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. బుధవారం మహారాష్ట్రలోని అరోలా యూనివర్శిటీ స్నాతకోత్సవంలో బంగారు పతకాన్ని అందుకున్నట్లు వైష్ణవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతంలు, సోదరి డా.ప్రత్యూషలు హర్షం వ్యక్తం చేశారు.

# పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పెద్దపీట

**వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్**

**మదనపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**



పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 11, 12వ వార్డుల్లో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డులు ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొన్నారన్నారు. రూ.25లక్షల వరకు వివిధ రకాల జబ్బులకు సంబంధించి ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందవచ్చునన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి పేదల ఆరోగ్యం కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. 13, 14వ వార్డుల్లో ఫర్హానరఫి, షబానా కరీముల్లా ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 13వ వార్డులో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ నూర్‌అజాం, కౌన్సిలర్లు జింకా రాధమ్మ, బేబివెల్కం చంద్రశేఖర్, రాజేష్, మేస్త్రీ శ్రీనివాసులు, ఖాజా, నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుభద్రతా నియమాలు ప్రతిఒక్కరు పాటించాలి

**పులివెందుల రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త ః**



రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించి ప్రమాదాలను దూరం చేయాలని పులివెందుల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు ప్రసాద్ అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పులివెందులలోని ఎంవీఐ ఆఫీస్‌లో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాల గురించి వివరించారు. ఆర్టీసీ డ్రైవర్లకు, ప్రైవేటు డ్రైవర్లకు సలహాలు, సూచనలిచ్చారు. ఈ కార్యక్రంలో ఆర్టీసీ డీఎం రామక్రిష్ణ, శ్రీచైతన్య డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నా సురక్ష ద్వారా వైద్య పరీక్షలు

**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**



జగనన్నా ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా బుధవారం పట్టణంలోని వైఎమ్ఆర్ కాలనీ యందు శాస్త్రీనగర్ సచివాలయ పరిధిలోని ప్రజలకు సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి సందర్శించి జగనన్నా ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం 25లక్షల వరకు ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచిత సేవలందిస్తున్నామన్నారు. అలాగే మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున సందర్శించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. శిబిరాన్ని పరిశీలించి సచివాలయం పరిధిలోని అందరు సేవలు పొందాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా దీర్ఘకాల, స్వల్పకాలిక వ్యాధిగ్రస్థులైన వారికి బీపీ షుగర్ వ్యాధులకు గర్భవతులు,బాలింతలకు పరీక్షలు చేసి తగినమందులు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్ సత్యహరీష్‌రెడ్డి, ప్రేమంత్, డాక్టర్ హిమబిందు, ఆఫ్తాల్మిక్ అధికారి వినోద్‌కుమార్ వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 408మందికి వైద్యపరీక్షలు చేశారు.కార్యక్రమంలో కమ్యూనిటి ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, శాస్త్రీనగర్ సచివాలయం సెక్రటరీలు, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ చేతుల మీదుగా పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



అన్నమయ్య జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వివి రాజ్ కమల్ వారి కుటుంబానికి రూ. 1,75,000లు పోలీసు వితరణ నిధి నుండి ఆర్థిక సాయం అందజేశారు. మరణించిన వారి కుటుంబం ఆర్థిక స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కళ్యాణం

**ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే : పురవీదులలో భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయ స్వామివారు**

**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలోని రాజుగారివీధిలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ నిర్వాహకులు పూనిపర్తి అనిల్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామ శాస్త్రి మంత్రోచ్చారణ మధ్య తెల్లవారుజామునుంచే స్వామివారికి గణపతిపూజ, అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలాంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రత్యేక బ్యాండు మేళతాళాల మధ్య కన్నులపడగగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారి ముత్యాల తలంబ్రాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం పలువురు భక్తులకు ప్రత్యేక అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామోత్సవాలను నిర్వహించారు. స్వామివారి అడుగడుగునా భక్తులకు మంచినీరు వారు పోసి స్వామివారికి కాయ , కర్పూర ం అందించి పలువురు భక్తులకు ప్రసాదాలు అందజేయడం జరిగింది.

**హనుమంతుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే :**

సీతారామాంజనేయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వైవీయూ ఈసి.మెంబర్ ఈసి.సుబ్బారావు, మున్సిపల్ అధ్యక్షులు సుందరరామిరెడ్డి, కన్వీనర్ యద్దారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రమణారెడ్డి, స్వచ్ఛఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, గానుగపెంట రమేష్‌బాబు, ఆవుల శ్రీను, బిజ్జం రమణతో పాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అనంతరం స్వామివారి కళ్యాణమహోత ్సవాన్ని

# ఈవిఎంల భద్రత, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన కలెక్టర్

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



సార్వత్రిక ఎన్నికలు 2024 కు సంబంధించి పోలింగ్ అనంతరం ఈవీఎంల భద్రత, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు నిమిత్తం అనువైన స్థలాన్ని ఎంపిక చేయటంలో గల అవకాశాలు, సాధ్యాల అంశాలపై బుధవారం ఉదయం అధికారులతో కలిసి రాయచోటిలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల, జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల మ్యాపులను, విస్తీర్ణం, కళాశాలలోని తరగతి గదులు, లేబరేటరీలు, మొదటి అంతస్తులో గల రూములను విస్తృతంగా కలియతిరిగి పరిశీలించారు. ఇందులో భాగంగా ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాల అవకాశాలపై అధికారులతో చర్చించారు. కాలేజీకి సంబంధించిన పూర్తి సమాచారంతో ప్రతి గదిని గుర్తించగలిగేలా పేర్లతో సహ స్పష్టమైన మ్యాపును రూపొందించి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో, కళాశాల యాజమాన్యంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, సర్వేశాఖ జిల్లా అధికారి జయరాజ్, ఆర్ అండ్ బి ఇఇ సహదేవరెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డైరెక్టర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు. శివప్రకాశ్‌రెడ్డి స్థానిక చెన్నముక్కపల్లె జడ్పి హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులు కావాలని, ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. బైజుస్, ప్యానెల్ బోర్డు యూజెస్, ట్యాబ్‌లను అందరూ చక్కగా వినియోగించుకోవాలని తెలియజేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను డిక్షనరీ ఏ విధంగా వినియోగిస్తున్నారు, నేర్చుకొనే విధానాన్ని తెలియజేశారు. ఉపాధ్యాయుల పనితీరు పాఠశాల వాతావరణం బాగా ఉందని తెలియజేశారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాబోయే నెల రోజుల్లో ఎస్ఎస్ పబ్లిక్ పరీక్షలు ఉన్నందున అవగాహన కల్పిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్బవరం హరిబాబు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం రైతులను నిర్బంధించడం దారుణం

**- వచ్చే ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెబుదాం - వంగిమళ్ల రంగారెడ్డి**

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



దేశంలోని రైతులు తమ సమస్యలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి ఈనెల 13వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవడం దారుణమని అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆరోపించారు. రాయచోటి పట్టణం రైతు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారన్నారు. రైతులపై పోలీసులు నీటి పంపులతో నిర్బంధనం చేయడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు దేశానికి ఎన్నెముక రైతు అంటారు కానీ, ఎన్నికల అనంతరం రైతును బిచ్చగాడిలా చూస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు భారీగా పెంచి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీతో ఎరువులు విత్తనాలు పురుగు మందులు సరఫరా చేయాలని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు.కార్యక్రమంలో రైతులు వెంకటేశు, గంగులప్ప,నారాయణ, సుబ్బన్న, వెంకటరమణ,నాగిరెడ్డి,సిద్దారెడ్డి పాల్గొన్నారు.

# గౌతమ్, రవిచంద్ర పాఠశాలల్లో వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

**గాలివీడు, ఫిబ్రవరి 14(ప్రభాతవార్త):**



వసంతపంచమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గౌతమ్, రవిచంద్ర పాఠశాలల్లో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వసంత పంచమి వేడుకల్లో పండితుల మంత్రోచ్చరణల మధ్య తల్లిదండ్రులు చిన్నారులు భక్తిశ్రద్ధలతో అభరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ జ్ఞానం, వాక్కు, విద్య మొదలైన శక్తులే సరస్వతీ మాత అన్నారు. దేశ సంస్కృుతి, సంప్రదాయాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానెయుల్ సైజు థామస్‌లు మాట్లాడుతూ భావితరాలకు బంగారు బాటలు వేయాలన్న ధ్యేయంతో అందుకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం తల్లిదండ్రులు చిన్నారులను తీసుకువచ్చి అక్షరాభ్యాసం చేయించారు. వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ చిన్నారుల చిట్టి చేతులతో అక్షరాలు దిద్దించారు. చిన్నారులతో రెండు పాఠశాలల్లో సందడిగా మారింది. అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నూతన్‌నాయక్, వైస్ ప్రిన్సిపల్ లిక్సన్ పాల్, ఉపాధ్యాయులు గరుడప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత పక్షపాతి కాంగ్రెస్.. దళిత దుష్మన్ వైకాపా

**వేంపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త ః**



దళితుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని చెప్పేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో స్వర్గీయ సంజీవయ్య 103వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సంజీవయ్య గొప్ప పరిపాలనా దక్షుడన్నారు. ఏపీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. వైకాపా దళిత దుష్మన్ అని తులసిరెడ్డి అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లించారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు లేక స్వయం ఉపాధి పథకాలు అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, రామక్రిష్ణ, అమర్, ఉత్తన్న, బద్రి రాఘవయ్య, వెంకటేష , మహబూబ్‌బాషా, ఆరుశేర్ల సుబ్బరాయుడు, బాలం సుబ్బరాయుడు, రవి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వంతో దైవాన్ని చూపించింది కృష్ణావతారం

**ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

**రాయచోటి, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త :**



మానవత్వంలో దైవత్వాన్ని చూపించింది కృష్ణావతారమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని వరిగ రహదారి మార్గంలో శ్రీదేవకీ యశోధ కృష్ణాలయ నిర్మాణ భూమి పూజలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుగయుగాలుగా శ్రీకృష్ణు డి తత్వం, జీవితం మానవ జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేస్తోందన్నారు. కష్టాలను, భయాలను, విఘ్నాలను తొలగించి విజయపథంలో శ్రీకృష్ణ నామం నడిపిస్తుందన్నారు.శాంతి, పురోగతితో ప్రజలు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ట్రస్టు వ్యవస్థాపకులు పదిలం మహేష్‌కుమార్ యాదవ్, భక్తులు, దాతలు సమిష్టిగా ఈ ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, కరోనా మందు సృష్టికర్త నెల్లూరు ఆనందయ్య, జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ బాలయ్య, రామాపురం జెడ్‌పిటిసి మాసన వెంకటరమణ, చెన్నూరు ఎంపిపి పీర్ల సురేష్, కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జానం రవీంద్ర యాదవ్, రామాపురం వైస్ ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, కెపిఆర్ కన్‌స్ట్రక్షన్ కనపర్తి చెన్నారెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు సగినాల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లయ్యకొండలో దీపపు స్తంభం పున: ప్రతిష్ట

**తంబళ్లపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల పరిధిలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో మల్లయ్యకొండ అభివృద్ధి పనులలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మల్లయ్యకొండ ఛైర్మన్ కె.ఆర్. మల్‌రెడ్డి, ఈవో రమణల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు అభిషేకాలు, దూపదీప నైవేద్యాలు సమర్పించి మంత్రోచ్చారణలతో దీపపు స్తంభాన్ని పున: ప్రతిష్టించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో పురాతన ఆలయ చరిత్ర కలిగిన శిలా శాసనాలను సైతం పున: ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివభక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్టా మహోత్సవం

**పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు**

**గ్రామోత్సవం వెంట అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**



**బద్వేలు రూరల్ , ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : 30,31,32**

పట్టణంలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగనంలో శ్రీ దుర్గ దేవి సమేత మల్లేశ్వర స్వామి నూతన బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గర్తపూజ, యంత్రస్థాపన , శాంతి పౌష్టక హోమములు, చర ప్రతిష్ట, బింబ కళాణ్యాసం , గోదర్శనం, బలిహరణ, పూర్ణాహుతి తదుపరి మొట్టదటిసారిగా ఆలయ ప్రాంగణంలో శ్రీ దుర్గామలేశ్వర స్వామి కళ్యాణమహోత్సవం వేదపండితులు సుబ్బరామ శర్మ, ప్రదీప్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవంలో భక్తు లకు అన్న ప్రసాద వితరణ కార్య క్రమం నిర్వహించారు. సాయంకాలం దుర్గాదేవి సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పలు సాంస్కృతి క కార్యక్రమాల మధ్య పురవీధులలో గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం వెంట ప్రత్యేక ప్రసాదాలను ఆలయ అభివద్ధి కమిటి సభ్యులు సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి,మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఇరిగేషన్ శాఖ ఏఈఈ ఊరిబిండి అశోక్‌కుమార్‌రెడ్డి, కాంట్రాక్టర్లు ఊరిబిండి మనోహర్‌రెడ్డి, బీరం రవిశంకర్‌రెడ్డి , దర్శి సుబ్బరాజ, వడ్లపూటి నాగభూషణంతె పాటు పలువురు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బచ్చు సుధాకర్, వాకమళ్ల నారాయణరెడ్డి, సధాకర్‌రెడ్డి, నాగార్జున , పెసలసుబ్రమణ్యంతో పాటు పలువురు కమిటి సభ్యులు పాల్గొన్నారు.